క్లుప్తంగా

బాల్యం మధుర జ్ఞాపకం



కృత్తివెన్ను: బాల్యం మధురమైన జ్ఞాపకమని, అందులోనూ విద్యార్థిదశ ఇంకా అందమైన జీవితమని పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సమావేశంలో పలువురు వ్యాఖ్యానించారు. స్థానిక సంగమూడి హైస్కూల్ వద్ద బుధవారం 1997-98వ సంవత్సరం టెన్త్ విద్యార్థులు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గతంలో తాము చదువుకున్న పాఠశాల వద్ద గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకున్నారు. ఉపాధ్యాయులు నరహరిశెట్టి రామ్మోహనరావు, శాయన వెంకట సుబ్రమణ్యేశ్వరరావు, వెనిగండ్ల అచ్యుతలను ఘనంగా సన్మానించారు.

ఎస్‌ఐగా ఎంపికైన మురళీకృష్ణకు సన్మానం



మర్రిపాలెం(నాగాయలంక): గ్రామంలో రైతు కుటుంబానికి చెందిన యువకుడు యన్నంశెట్టి మురళీకృష్ణ ఇటీవల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికైన సందర్భంగా మండలంలోని బండ్రెడ్డి హరి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో బుధవారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. 2014లో కానిస్టేబుల్‌గా ఎంపికైన మురళీకృష్ణ ఆ ఉద్యోగంలో చేరినప్పటికీ ఎస్‌ఐ ఉద్యోగం మీదే దృష్టి ఉండేదని, కష్టపడి చదివి ఆ లక్ష్యం సాధించాడని మిత్రులు కొనియాడారు. కార్యక్రమంలో బండ్రెడ్డి బోసు, లేబాక నాగేశ్వరరావు, బండ్రెడ్డి వాసు, రాఘవరావు, యన్నంశెట్టి పవన్‌కళ్యాణ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

50 చర్చిలకు ఎయిర్ కూలర్లు వితరణ



పురిటిగడ్డ(చల్లపల్లి): మండలంలోని పురిటిగడ్డ గ్రామంలో ఉన్న ఇండియా విలేజ్ మినిస్ట్రీస్(ఐవీఎం) డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ - రోజా దంపతులు రూ.7.50లక్షల వ్యయంతో 50 చర్చిలకు ఎయిర్‌కూలర్లు, 50 మంది పాస్టర్లకు వస్త్ర దానం చేశారు. చల్లపల్లి మండలంలో పది, ఘంటసాల మండలంలో ఐదు, మోపిదేవి మండలంలో ఆరు, అవనిగడ్డ మండలంలో ఏడు, నాగాయలంక మండలంలో ఐదు, కోడూరు మండలంలో ఆరు, పమిడిముక్కల మండలంలో నాలుగు, బాపట్ల జిల్లా భట్టిప్రోలు, పెరవలి గ్రామాల్లో ఏడు చర్చిలకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఐవీఎం ప్రతినిధి వేములపల్లి విజయ, పాస్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో మాడుగుల నాగఫణిశర్మ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ప్రముఖ ద్విసహస్ర(సంస్కృతం, తెలుగు) అవధాని మాడుగుల నాగఫణి శర్మ బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన నాగఫణి శర్మను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ ఏఈఓ ఎస్.రమేష్‌బాబు, వైదిక కమిటీ సభ్యులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

సరిహద్దు స్తంభాల వితరణ

గణపేశ్వరం(నాగాయలంక): గ్రామంలోని దళితవాడ శ్మశానవాటికను విడగొట్టి సరిహద్దులు నిర్ణయించనున్న నేపథ్యంలో అవనిగడ్డలోని శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిశోర్ నాయుడు రూ.15వేల విలువైన సిమెంట్ స్తంభాలు వితరణగా ఇచ్చారు. ఈ మేరకు బుధవారం వాటిని దళితవాడ గ్రామ పెద్దలకు ఆయన స్వయంగా అందజేశారు. దోనె మిఖాయేలు, గుంటూరు సురేష్, తోట నరసింహానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలో 50మంది యానాదులకు రగ్గులు పంపిణీ

పండుగ రోజులు పురస్కరించుకుని మండలంలోని తలగడదీవి ఎస్టీ కాలనీలో 50మంది యానాదులకు బుధవారం శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిశోర్ నాయుడు రగ్గులు పంపిణీ చేశారు. కాలనీ పెద్ద సుబ్బారావు, గుడివాక శేషుబాబు, ప్రకాష్, నలిగిలి రాజేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా సీఎం జగన్

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల బాగు కోసం పరితపించిన భారతరత్న బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 19న విజయవాడలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమయ్యే 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అవనిగడ్డ నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలి రావాలని ఎమ్మెల్యే పిలుపు నిచ్చారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం జగన్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు పేదల జీవన విధానంలో పెను మార్పులు తీసుకొచ్చాయని చెప్పారు. మరిన్ని సంక్షేమ పథకాలు అందుకోవాలంటే మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సమావేశంలో ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజుల జయగోపాల్, పార్టీ నాయకులు ఇంకొల్లు శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం చేపట్టిన సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు పాల్గొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి, సీతాయిలంక వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే సింహాద్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు పోరాటాలు చేసిన అంబేడ్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. ఆ మహానుభావుడిని నిత్యం స్మరించుకునేలా విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసిన 206 అడుగుల అంబేడ్కర్ భారీ విగ్రహ మహోత్సవ కార్యక్రమానికి వేలాదిగా తరలి రావాలని పిలుపు నిచ్చారు.



సీతాయిలంకలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఉప్పాల రాము

మోపిదేవిలో...

మోపిదేవి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరూ గౌరవించాలని జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని గంజివానిపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈనెల 19న విజయవాడలో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆవిష్కరించనున్న సందర్భంగా ప్రతి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి రాజ్యాంగ నిర్మాతను స్మరించుకున్నారు. తహసీల్దార్ కె.నవీన్ కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీపీ రావి దుర్గావాణి, ఎంఆర్ఐ సునీల్, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరావు, వీఆర్వో శ్రీనివాసరావు, నందిగం అభిషేకరావు తదితరులు పాల్గొన్నారు.

పెడనలో...

పెడన: ఈ నెల 19న విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహం, స్మృతివనం కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని వైఎస్సార్ సీపీ పెడన నియోజవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము పిలుపునిచ్చారు. స్థానిక 16వ వార్డులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు, సచివాలయ మండల కన్వీనర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 19వ తేదీ ఉదయం 11 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి విజయవాడ నగరానికి వాహనాల ద్వారా ర్యాలీగా తరలి వెళ్లనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, కృత్తివెన్ను ఎంపీపీ గరుడప్రసాద్, పార్టీ నాయకులు కటకం ప్రసాద్, రాజులపాటి అచ్యుతరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ఖాజా, బైలపాటి జ్యోతి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు మల్లి, కొండవీటి నాగబాబు, సుజ్ఞానం మహేష్, గంగాధరరావు, బుర్ర మహేష్, ముత్యాల మురళి తదతరులు పాల్గొన్నారు.

రాముకు అభినందనల వెల్లువ

వైఎస్సార్ సీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెడన నియోజకవర్గ సమన్వయకర్తగా ఉప్పాల రామును నియమించడంతో అభినందనలు పరంపర కొనసాగుతోంది. బుధవారం కృత్తివెన్ను, పెడన పట్టణానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున రామును కలిసి అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలో పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాచవరం, దేవునిచెరువు, పెడన బైపాస్‌రోడ్డు, వలందపాలెం, దేవునిచెరువు, పెడన బైపాస్‌రోడ్డు, జెడ్పీ సెంటర్, పట్టాభిపురం, గంగులతోట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

గుడివాడ డీఎల్‌డీవో సుబ్బారావు బదిలీ



కేవీ సుబ్బారావు

చిలకలపూడి(మచిలీపట్నం): గుడివాడ డీఎల్‌డీవోగా పని చేస్తున్న కేవీ సుబ్బారావును బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. సుబ్బారావు గుడివాడ డీఎల్‌డీవోతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జ్‌గా కూడా పనిచేస్తున్నారు. సుబ్బారావును స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

సేఫ్‌హౌస్‌లో సంక్రాంతి వేడుకలు

కృత్తివెన్ను: మండల పరిధిలోని పోడు గ్రామంలో ఉన్న న్యూహరిజోన్ సేఫ్‌హౌస్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకొన్నట్లు హోం చీఫ్ ఫంక్షనరీ ఎస్తేర్ ప్రియాంక తెలిపారు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్న వీరికి పండుగ పేరుతో సంతోషం కలిగించేలా పండుగ ప్రాముఖ్యత వివరించేలా కార్యక్రమాలు నిర్వహించినట్లు హౌస్ అడ్మినిస్ట్రేటర్ విక్టర్ వివరించారు. ఆటల పోటీలు, పిండి వంటల రుచులు అందించామన్నారు. హోమ్ ఇన్‌చార్జ్ దీవెన, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచిన గూడూరు-2 సచివాలయం జట్టు



మచిలీపట్నంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



నాగాయలంక హైస్కూలు గ్రౌండ్స్‌లో క్రికెట్ ఆడుతున్న గ్రామీణ క్రీడాకారులు

మచిలీపట్నంటౌన్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలో పలు ఆటల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆంధ్ర జాతీయ కళాశాల క్రీడా మైదానంలో క్రికెట్ మ్యాచ్‌లు, నోబుల్ కళాశాల ఆవరణలో వాలీబాల్, పురుషుల కబడ్డీ, మహిళల ఖోఖో పోటీలు నిర్వహించారు. తొమ్మిది క్రికెట్ మ్యాచ్‌లు, నాలుగు వాలీబాల్, మూడు కబడ్డీ, ఐదు ఖోఖో మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ ఆటల పోటీలను చిలకలపూడి పాండురంగ ఉన్నత పాఠశాల పీఈటీ రమేష్‌కుమార్ పర్యవేక్షించారు.

నాగాయలంకలో క్రికెట్ సందడి

నాగాయలంక: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌లో మండల స్థాయిలో తొలిరోజు క్రికెట్ పోటీలు బుధవారం జరిగాయి. నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ గ్రౌండ్స్‌లో అయిదు జట్లు పోటీకి తలపడ్డాయి. తొలుత పోటీలను ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ ప్రారంభించారు. మొత్తం మండల స్థాయికి చేరిన 23 క్రికెట్ జట్లలో ఏడు మహిళా జట్లు కూడా ఉండడం విశేషం.

మండల స్థాయి క్రీడాపోటీలు గురువారం ముగుస్తాయి. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపిస్తారు. వ్యాయామ ఉపాధ్యాయులు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావు, సీహెచ్ సుబ్బారావు, అధికారులు, గ్రామ కార్యదర్శులు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత గూడూరు జట్టు

గూడూరు: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా బుధవారం గూడూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన వాలీబాల్ ఫైనల్ పోటీల్లో గూడూరు -2 సచివాలయం పరిధిలోని జట్టు విజేతగా నిలిచింది. మండలంలోని 17 సచివాలయాల నుంచి 17 జట్లు మండల స్థాయి పోటీలలో తలపడ్డాయి. ఫైనల్ పోటీల్లో ఆకులమన్నాడుతో తలపడిన గూడూరు జట్టు మండల స్థాయిలో విజేతగా నిలిచినట్లు ఎంపీడీవో సుబ్బారావు తెలిపారు.

ఖోఖో పోటీల విజేత లక్ష్మీపురం

కృత్తివెన్ను: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా బుధవారం మండల స్థాయిలో ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో చినపాండ్రాక, లక్ష్మీపురం జట్ల మధ్య ఫైనల్స్ జరగ్గా లక్ష్మీపురం జట్టు విజయం సాధించింది. గెలుపొందిన జట్టు నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఆడుతుందని ఎంపీడీవో పిచ్చిబాబు తెలిపారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్న సీఎం జగన్

డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మచిలీపట్నంటౌన్: పేదల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి అన్నారు. నగరంలోని 1, 26 డివిజన్లలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాలు నిర్వహించారు. 26వ డివిజన్ జార్జికార్నేషన్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వ్యయాన్ని రూ.25 లక్షలకు పెంచిన ఘనత దేశంలో సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పేదల వైద్యానికి, విద్యకు పెద్దపీట వేస్తున్న సీఎం జగన్‌కు మరోసారి మద్దతు ఇచ్చి ఆశీర్వదించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ జోగి చిరంజీవి, 26వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మాడపాటి వెంకటేశ్వరరావు, వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బైక్ ఢీ కొనడంతో ముగ్గురికి గాయాలు

పెనమలూరు: విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలు కావటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి గ్రామానికి చెందిన డి.సత్యగౌరిదేవి భర్త రత్నకిషోర్ కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. వారు మంగళవారం కుటుంబ సభ్యులతో పోరంకిలోని ఓ సినిమా హాల్‌లో సినిమాకు వెళ్లారు. సినిమా పూర్తయిన తరువాత సత్యగౌరిదేవి, ఆమె కుమార్తె భవ్యశ్రీ, అత్త సత్యనారాయణమ్మ బందరు రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన బైక్ వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు అవ్వటంతో 108 వాహనంలో విజయవాడ జీజీహెచ్‌కు తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలు

ఉంగుటూరు: చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై చిన్న అవుటపల్లిలో ఆర్టీఏ చెక్ పోస్ట్ సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా మన్నేపల్లి గ్రామానికి చెందిన రమేష్, ఖమ్మంకు చెందిన నరేష్ ఇద్దరు బుధవారం హనుమాన్‌జంక్షన్ నుంచి ఆటోలో విజయవాడ వైపు వెళ్తున్నారు. గన్నవరం మండలం చిన్న అవుటపల్లిలో ఆర్టీఏ చెక్‌పోస్ట్ సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్కూరు ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు భారీ వాహనాలకు అనుమతి లేదు

గుడివాడరూరల్: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రా కదలిరా కార్యక్రమం ఉన్న ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం 12గంటల నుంచి భారీ వాహనాలకు పట్టణంలోకి ప్రవేశం లేదని గుడివాడ తాలూకా సీఐ ఏసుబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లారీలు, ప్రైవేట్ వాహనాలను హనుమాన్ జంక్షన్, ముదినేపల్లి, గుడ్లవల్లేరు, పెదపారుపూడి, పామర్రు ప్రాంతాల నుంచి అనుమతించబడవని, దీనికి భారీ వాహనదారులు సహకరించాలని కోరారు. వాహనదారులు ఇబ్బందులు పడకుండా వేరే మార్గం ద్వారా ప్రయాణించాలని సీఐ సూచించారు.

పల్నాటి, చోడే కుటుంబ సభ్యుల కలయిక



మూడు తరాల పల్నాటి, చోడే కుటుంబసభ్యులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: తెలుగు సంస్కృతి, సంప్రదాయలు, కుటుంబ విలువలు నేటి తరానికి తెలియజేప్పేందుకు మూడు తరాలకు చెందిన వారంతా ఒక్కచోట కలిసి సంక్రాంతి పండుగ ఉత్సాహంగా జరుపుకున్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని రైల్వేస్టేషన్ సమీపంలో దాసాంజనేయ స్వామి దేవస్థానం వద్ద పల్నాటి, చోడే కుటుంబ సభ్యుల సంక్రాంతి సంబరాలు నాలుగు రోజులుగా ఘనంగా జరిగాయి. దేశ, విదేశాల్లో స్థిరపడిన వారంతా సుమారు 200 మంది కుటుంబ సభ్యులు సంక్రాంతికి స్వస్థలానికి తరలివచ్చారు. ఒకరికి ఒకరి ఆత్మీయంగా పలుకరించుకుంటూ, తమ బంధుత్వాలను గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి కుటుంబం గొప్పతనాన్ని, కలిసిమెలసి ఐక్యంగా ఉండటంలో కలిగే అప్యాయతను వారసులకు తెలియజేశారు. ఆధునిక సమాజంలో ఒత్తిడితో కూడిన జీవనాన్ని గడుపుతూ, కుటుంబ విలువలు కనుమరుగవుతున్న తురుణంలో ఏటా సంక్రాంతికి కుటుంబ సభ్యులంతా కచ్చితంగా కలవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆటవిడుపుగా ముగ్గులు, చిత్రలేఖనం పోటీలు, క్రికెట్, షటిల్, నృత్య పోటీలు నిర్వహించారు. పల్లెటూరు వాతావరణంలో బంధువుల మధ్య సంక్రాంతి జరుపుకోవటం ఆనందంగా ఉందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పల్నాటి పెద్ద మస్తాన్, చోడే సుబ్బారావు కార్యక్రమాలను నిర్వహించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు బుధవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. విజయవాడ భవానీపురానికి చెందిన డి.శోభన్‌బాబు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించిన ఏఈఓ ఎన్.రమేష్ బాబు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

రేపు బస్టాండ్ నుంచి స్వరాజ్ మైదానంకు ర్యాలీ

కృష్ణలంక(విజయవాడతూర్పు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈ నెల 19న పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి స్వరాజ్ మైదానం వరకు ఏపీ స్టేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రవి, కె.ఎజ్రా శాస్త్రి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బందర్ రోడ్డులో 19 ఎకరాల సువిశాల స్థలంలో అంబేడ్కర్ పేరిట స్మృతి వనం ఏర్పాటు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంబేడ్కర్ జీవిత విశేషాలతో కూడిన మ్యూజియం, కన్వెన్షన్ సెంటర్ థియేటర్‌ను ఏర్పాటుచేసి నేటి తరానికి ఆయన గురించి తెలియజేసే ప్రయత్నం శుభసూచకమన్నారు. విగ్రహావిష్కరణకు రాష్ట్రం నలుమూలల నుంచి తమ అసోసియేషన్ ప్రతినిధులు పెద్ద ఎత్తున రానున్నారని తెలిపారు. కుల, మతాలకు అతీతంగా నిర్వహిస్తున్న ప్రాంభోత్సవ కార్యక్రమానికి ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

కారు ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

ఉంగుటూరు: జాతీయ రహదారి దాటుతున్న ఓ మహిళను కారు ఢీ కొనడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముక్కపాడుకు చెందిన శాంతమ్మ బుధవారం ఆత్కూరులోని తన బంధువుల ఇంటికి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటే ప్రయత్నం చేసింది. అదే సమయంలో ఏలూరు నుంచి విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని కారు శాంతమ్మను బలంగా ఢీకొంది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

54 మద్యం బాటిళ్లు స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని కొత్తపేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 54 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే స్టేషన్ వెస్ట్ బుకింగ్ వద్ద ఓ వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సెక్టార్ ఎస్‌ఐ ప్రసన్నలక్ష్మి నిర్వహించిన తనిఖీలలో దార్ల అప్పలరాజు అనే వ్యక్తి వద్ద నుంచి 34 బాటిల్స్, జక్కంపూడిలోని వైఎస్సార్ కాలనీలో గుర్రం శివకుమారి వద్ద 20 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామని సెక్టార్ ఎస్‌ఐ జాన్‌బాషా పేర్కొన్నారు. నిందితులిద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో ఓ వ్యక్తిపై నలుగురు దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పల్లిపేటకు చెందిన గోగం గోపీ బోర్‌వెల్ పనులు చేస్తుంటాడు. కాగా గోపీ స్నేహితులతో సుగాలీకాలనీ వద్ద మాట్లాడుతుండగా అంద్రాజు అంజిశ్వరరావు, అంద్రాజు భార్గవ్, వల్లభనేని వెంకటేష్, మరో వ్యక్తి అకారణంగా గొడవ పడి దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.